SUNDAY FOCUS


లడ్డూ, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, దద్దోజనం, క్షీరాన్నం.. ఇలా తిరుమల శ్రీనివాసుడికి సమర్పించే నైవేద్యాలు అనగానే పవిత్ర భావంతోపాటూ నోరూరుతుంది. ఘుమఘుమలు ముక్కులను తాకుతాయి. తిరుమల ప్రసాదాల రుచి ఇంకెక్కడా ఎందుకు రాదా అనే సందేహం కలుగుతుంది. అయితే కొన్నేళ్లుగా ప్రసాదాల రూపూ రుచీ మీద పెదవిరుపులు పెరిగాయి. 'అబ్బే.. అప్పుడున్న రుచి.. ఇప్పుడెక్కడిది?' అనే నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. జగనన్న పాలనలో తిరుమల ప్రసాదాలు కూడా నాణ్యతలేకుండా పోయాయనే విమర్శలూ హోరెత్తాయి.

**ఎందుకు ఇలా? ఏం జరిగింది?**

ప్రసాదాలకు ముడి పదార్థాల వాడకంలో, దిట్టంలో మార్పులు జరిగాయి? నాణ్యమైన పదార్థాలు వాడడం లేదా? లడ్డూ నాణ్యతే కాదు, సైజూ తగ్గిపోయిందనీ, అన్నప్రసాదాలు తక్కువ వ్యవధిలోనే పాడైపోతున్నాయనీ భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వున్నారు.



గతంలోని అన్నప్రసాదాలు





ఆర్గానిక్ ప్రసాదాలు

# తిరుమల ప్రసాదాల రుచి ఎందుకు తగ్గింది?

- టీటీడీని కలవరపెడుతున్న భక్తుల అసంతృప్తి
- ఆర్గానిక్ ధాన్యం వాడకంపై పునఃసమీక్ష

శ్రీవారి లడ్డూప్రసాదానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆలయంలో వితరణ చేసే అన్నప్రసాదాలకూ అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతినిత్యం త్రికార నైవేద్యం పేరుతో శ్రీవారికి రోజుకు మూడు పూటలా నైవేద్య సమర్పించడం ఆనవాయితీ. ఇందులో నైవేద్య సమర్పణ సమయాన్ని మొదటి గంట, రెండో గంట, మూడో గంటగా వ్యవహరిస్తారు. తొలి నివేదన ఉదయం 5.30కు, రెండో నివేదన ఉదయం 10 గంటలకు, రాత్రి నివేదన 7.30 గంటలకు సమర్పిస్తారు. వారపు సేవలను బట్టి నివేదన సమర్పణ సమయం మారుతుంటుంది. స్వామి నివేదించే ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూ, వడ, సీరా, దోశ, ప్రసాదాలతోపాటు చక్కెరపొంగళి, కదంబం, పులిహోర, దద్దోజనం, మిరియాల పొంగలి, సేకరాబాత్, మొలహోరా వంటి అన్నప్రసాదాలూ ఉంటాయి. వీటిని ఆలయంలోని బంగారువాకిలికి ఆగ్నేయదిశగా ఉన్న పోటులో శ్రీవైష్ణవులు పవిత్రంగా ఇప్పటికీ కట్టెల పొయ్యలపైనే తయారు చేస్తున్నారు. ప్రతి ప్రసాదాన్ని ఒక్కో గంగాళంలో తీసుకెళ్లి మూలవర్లకు నివేదించడం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## కొవిడ్ తర్వాత భక్తులకు దూరమైన ప్రసాదాలు

కొవిడ్ తర్వాత తిరుమలలో స్వామికి సమర్పించే అన్నప్రసాదాల్లో తేడా మొదలైంది. రుచి తగ్గిపోవడంతోపాటూ, తయారు చేసే ప్రసాదాల పరిమాణం తగ్గిపోయింది. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కాదు. గతంలో స్వామి దర్శనానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ బయటకు రాగానే చక్కెర పొంగలో, పులిహోరో, దద్దోజనమో దొన్నెలో పెట్టి చేతికిచ్చేవారు. ఇప్పుడు వీఐపీలకు తప్ప అన్నప్రసాదాలు అందడం లేదు. ఇందుకు కారణం - అన్నప్రసాదాల తయారీ బాగా తగ్గించేయడమే. గతంలో స్వామికి నివేదించేందుకు ప్రతిరోజు 29 గంగాళాల అన్నప్రసాదాలు తయారు చేసేవారు. శుక్రవారం అభిషేకం సందర్భంగా 40 గంగాళాలు సమర్పిస్తే, గురువారం తిరుప్పావై సేవకు 29 గంగాళాలకు అదనంగా మరో 40 గంగాళాల అన్నప్రసాదాలను స్వామికి సమర్పించేవారు. దర్శనానంతరం భక్తులకు పంచడానికి వీలుగా రోజూ మరో 60గంగాళాల ప్రసాదాలు చేసేవారు. ఇందువల్ల రోజూ 25-30 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందేవి.

### ఇప్పుడు ఇలా...

కొవిడ్ సమయంలో భక్తులు ఉండరు కాబట్టి అదనపు ప్రసాదాల తయారీని తగ్గించి కేవలం స్వామికి మాత్రమే సమర్పిస్తూ వచ్చారు. ఆతర్వాత భక్తుల సంఖ్య నెమ్మదిగా పెరిగినప్పటికీ దీన్నే కొనసాగించేశారు. వాటి పరిమాణం కూడా దారుణంగా తగ్గించేశారు. పైగా ఆర్గానిక్ పదార్థాలతో తయారు చేసిన అన్నప్రసాదాలనే స్వామికి నివేదించడం మొదలుపెట్టారు. గోఆధారిత వ్యవసాయంతో పండించిన పంటలతోనే గోవిందునికి నైవేద్యం సమర్పించే విధానం 2022 అక్టోబరు నుంచి అమలు అవుతోంది. రోజుకు కేవలం 204 కిలోల దేశీయ బియ్యంతో చేసిన అన్నప్రసాదాలను మాత్రమే స్వామికి ప్రస్తుతం నివేదిస్తున్నారు. దీంతో ఇవి సాధారణ భక్తుల దాకా రావడం లేదు. అధికారులు, వీఐపీలకే సరిపోతున్నాయి.

### రుచి తగ్గడానికి కారణాలేమిటి?

బహురూపి, నారాయణకామిని, రత్నచోళి, కాలాబట్, చింతలూరి సన్నం, చిట్టిముత్యాలు, ఎర్రబంగారం వంటి దేశీయ వరిబియ్యంతోనే అన్నప్రసాదాలను వండుతున్నారు. ఈ అన్నప్రసాదాల రుచిపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. మునుపటి అన్నప్రసాదాలతో పోల్చుకుని అందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా త్వరగా పాడైపోతున్నాయి కూడా. నిజానికి సేంద్రియ పదార్థాలతో చేసిన వంటల రుచి భిన్నంగా ఉంటుంది. వీటిని వండే పద్ధతి కూడా మారుతుంది. ముడి బియ్యం వాడుతుంటే ఎక్కువ సేపు నానబెట్టడం వంటివి చేయాలి. సేంద్రియ ధాన్యాలతో రకరకాల వంటలు రుచిగా ఎలా చేయవచ్చో అనేక పుస్తకాలు కూడా విడుదలయ్యాయి. ప్రత్యేకంగా రెస్టారెంట్లే నడుస్తున్నాయి. వీటిని ఇష్టపడి మరీ తింటున్నారు. మరి టీటీడీ చేస్తున్న అన్నప్రసాదాలు మాత్రం ఎందుకు రుచిగా లేవన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీఐపీల నుంచి కూడా విమర్శలు పెరగడంతో టీటీడీ అధికారులు పూర్వపు విధానమే అనుసరించాలా అనే చర్చ కూడా చేస్తున్నారు. సాధారణ సన్న బియ్యంతోనే అన్నప్రసాదాలు తయారు చేయాలా లేక గోఆధారిత ఉత్పత్తులతోనే కొనసాగించాలా అనే అంశంపై కొత్తగా పాలక పగ్గాలు చేపట్టిన అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకుసంబంధించిన నిపుణుల సూచనలు కూడా కోరుతున్నారు. మునుపటిలా అందరికీ అందేలా అన్నప్రసాదాల తయారీ పరిమాణం కూడా పెంచాలని భక్తులు కోరుతున్నారు.







# జలమయం

## తిరుపతిలో దంచికొట్టిన వాన

**తిరుపతి మధురానగర్‌లో మోకాటి లోతు నీళ్లు, ఇళ్లలోకి చేరిన వర్షపునీరు**

తిరుపతి అర్బన్, ఆగస్టు 10: తిరుపతిలో శనివారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. పెద్ద పెద్ద చినుకులతో ప్రారంభమై దాదాపు గంటపాటు కుండపోత వర్షం కురిసింది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు తడిచి ముద్దయ్యారు. స్థానిక మధురానగర్‌లోని ఇళ్లలోకి నీరు చేరాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.

# బలి తీసుకున్న బతుకు బండి!

- ట్రాక్టరు కింద నిద్రించిన డ్రైవర్
- చూసుకోకుండా వాహనాన్ని అతడిపై ఎక్కించేసిన యజమాని
- తీవ్రగాయాలతో యువకుడి మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: తల్లిదండ్రులు లేకపోయినా ట్రాక్టర్ డ్రైవర్‌గా ఆ యువకుడు జీవనం సాగించేవాడు. బతుకునిచ్చిన బండి కింద అలసటతో ఆదమరచి నిద్రించాడు. దీన్ని యజమాని చూసుకోకుండా ట్రాక్టర్‌ను నడపడంతో బతుకుబండే ఆ యువకుడిని బలి తీసుకున్న విషాద సంఘటన తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం భవానీశంకరాపురానికి చెందిన గుణశేఖర్(20)కు బాల్యంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దాంతో బంధువుల సంరక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద గ్రావెల్ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం వేళ విరామ సమయంలో ట్రాక్టర్ కింద నీడలో సేద తీరేవాడు. శనివారం కూడా తన ట్రాక్టర్ ట్రాలీ కింది నిద్రించాడు. దీన్ని గమనించని ట్రాక్టర్ యజమాని ఆ వాహనాన్ని నడపడంతో దానికింద ఉన్న గుణశేఖర్‌పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గుణశేఖర్‌కు సమీప బంధువు బత్తెయ్య తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుణశేఖర్(ఫైల్ ఫొటో)



## వరసిద్ధుడి ఆలయంలో రద్దీ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

# కొండపై భద్రతా లోపాలు ఉండకూడదు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా భద్రతా లోపాలు ఉండకూడదని విజిలెన్స్ అధికారులను టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. సీవీఎస్వోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇప్పటికే టీటీడీలో భద్రత అంశాలపై పలు సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాలనూ క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు రానున్న నేపథ్యంలో వాహనసేవలు వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగానే శనివారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మాడవీధులు, ఎలిఫెంట్ గేట్ వద్ద క్యూలైన్లను, ఆలయంలోని ప్రసాదాల పోటు, ముడిసరుకులు నిల్వ ఉంచే ఉగ్రాణాన్ని పరిశీలించారు. ఆలయం పైభాగంలో ఉండే ఏఆర్ సెక్యూరిటీ సిబ్బంది పాయింట్లు, గొల్లమండపంపై ఉన్న సెక్యూరిటీ పాయింట్లను పరిశీలించారు. గతంలో బ్రహ్మోత్సవాల నిర్వహణ, భద్రత ఏర్పాటు, బందోబస్తు వంటి అంశాలపై అవగాహన చేసుకోవడంతోపాటు కొన్ని సూచనలు చేశారు. వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో గిరిధర్, వీఐలు తదితరులు ఉన్నారు.



మాడవీధులను పరిశీలిస్తున్న శ్రీధర్

# ఫుడ్ ప్రాసెసింగ్‌లో మహిళలు రాణించాలి

ఏర్పేడు, ఆగస్టు 10: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తిరుపతి ఐఐటీ డీన్, క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ (సీఐసీ) సీఈవో రాఘవరావు అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో శనివారం ఎంఎస్ఎంఈ (ఎంవోఎఫ్ఐ), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్తంగా జిల్లాలోని మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండ్రోజుల తరగతులను శుక్రవారం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ జోనల్ మేనేజరు సాయి శ్రీనివాస్ ప్రారంభించిన విషయం తెలిసిందే. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా, రేణుకా బయోఫామ్స్ ఎండీ ఎస్.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డీఆర్పీ ఎ.ప్రసాద్, తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీ ఇంజనీరింగ్ పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

# టీటీడీ ఇంజనీరింగ్ ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు!

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా, అవసరానికి మించి నిధులు కేటాయించారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. రాజకీయ లబ్ధికోసం గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇంజనీరింగ్ పనులకు వందల కోట్ల రూపాయలు కేటాయించిందని, అవసరం లేకున్నా రోడ్లు వేశారని, కమీషన్ల కోసం శ్రీవారికి చెందిన కోట్లాది రూపాయలు ఖర్చు చేశారంటూ తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రత్యేకంగా స్టేట్ విజిలెన్స్ బృందాలను తిరుపతికి పంపింది. వారు సుమారు రెండు నెలలపాటు ఇంజనీరింగ్ విభాగం మాత్రమే కాకుండా పలు కీలకమైన విభాగాల్లోనూ సోదాలు చేశారు. ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పలువురు అధికారులు, ఉద్యోగులను విచారించారు. వారి వద్దనుంచి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేశారు. స్వయంగా అన్నింటినీ పరిశీలించారు. ఈక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన, చేస్తున్న దాదాపు 58 మంది అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ బోర్డు తీర్మానాలను ఎందుకు వ్యతిరేకించలేదంటూ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. త్వరలో కొందరిపై చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే మిగిలిన విభాగాల అధికారులు, ఉద్యోగులకూ త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

# తిరుమలలో 15 నుంచి పవిత్రోత్సవాలు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికులు, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు కలుగుతుంటాయి. ఈక్రమంలో వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962 నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను తిరిగి ప్రారంభించింది. ఉత్సవాల్లో భాగంగా మూడ్రోజులపాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 15న పవిత్ర ప్రతిష్ఠ, 16న పవిత్ర సమర్పణ, చివరిరోజు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

**ఆర్జిత సేవలు రద్దు**

పవిత్రోత్సవాల్లో భాగంగా ఈనెల 14న అంకురార్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అలాగే 15న తిరుప్పావడ, 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. 18వ తేదీ కూడా కల్యాణోత్సవాన్ని రద్దు చేశారు.

# గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

తిరుపతి(విద్య), ఆగస్టు 10: గిరిజన అభ్యర్థులకు ఉచితంగా భోజన వసతితోపాటు డీఎస్సీ శిక్షణను ఉచితంగా అందించనున్నట్టు తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వంద మంది గిరిజన అభ్యర్థులకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తిరుపతి కలెక్టరేట్‌లోని బీ బ్లాక్, 5వ అంతస్తులోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం లేదా సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్య (సెల్ నెంబరు: 94935 24121)ను సంప్రదించవచ్చని సూచించారు.

తొలి మహిళా కళాశాల

# పద్మావతికి 72 ఏళ్లు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ్మాయిల కోసమే మొదలైన పద్మావతి కాలేజీ నేడు 72వ వసంతంలోకి ప్రవేశిస్తోంది. మహిళల సాధికారతకు సగౌరవ చిహ్నంగా నిలుస్తోంది. టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో 1952 ఆగస్టు 11న 25మంది విద్యార్థులు, 8మంది అధ్యాపకులతో ప్రారంభమైన పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ఇప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించి చదువుల మహావటవృక్షమై విలసిల్లుతోంది.

ప్రత్యేక కథనం | తిరుపతి రూరల్

ఆంధ్ర రాష్ట్రంలో తొలి మహిళా కళాశాల ఏర్పాటులో అప్పటి టీటీడీ ఈవో అన్నారావు కృషి ఎనలేనిది. తొలినాళ్లలో మద్రాస్ వర్సిటీకి అనుబంధంగా ప్రారంభమైన పద్మావతి కళాశాల.. ప్రస్తుతం 28 విభాగాలతో 2800 మంది విద్యార్థినులతో సరస్వతి క్షేత్రంగా విరాజిల్లుతోంది. 2022లో 3.43 హైయస్ట్ స్కోర్‌తో న్యాక్ ఏప్లస్ గ్రేడ్ గుర్తింపును సాధించగా.. 2024 జనవరిలో యూజీసీ అటానమస్ హోదాను సంతరించుకుంది. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్యతోపాటు భోజన, వసతి సౌకర్యాలను కూడా ఉచితంగా అందిస్తున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ప్రత్యేక శిక్షణ కోసం ఎన్‌సీసీ(ఆర్మీ)వింగ్‌తో రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లను నిర్వహిస్తుండడం ప్రత్యేకత. విద్యార్థుల శారీరక వికాసానికి గేమ్స్ అండ్‌స్పోర్ట్స్ విభాగం, నైపుణ్యాల పెంపునకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్లేస్‌మెంట్ కేంద్రాన్ని నడుపుతున్నారు. కళాశాలకు అనుబంధంగా 8బ్లాక్‌లలో 2,100 మంది విద్యార్థులకు సరిపడా వసతిగృహాలు అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం 1,850మంది విద్యార్థులు వసతిగృహంలో ఉండి విద్యాభ్యాసం చేస్తున్నారు. కాగా విద్యా రంగంలో పెనుమార్పులు జరిగినా తన ఉనికిని కాపాడుకుంటూ స్థాయిని తగ్గించుకోకుండా విద్యాపరంగా మంచి డిమాండ్ ఉన్న కళాశాలగా పద్మావతి కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రస్తుతం డాక్టర్ టి.నారాయణమ్మ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.



చారిత్రక సాక్ష్యం

### చదివినచోటే కొలువులు

1965-67లోనే దాదాపు 30మంది పూర్వవిద్యార్థినీలు అదే కళాశాలలో అధ్యాపకులుగా చేరడం పద్మావతి కళాశాల ప్రత్యేకత. ఈ చదువుల వారసత్వం తర్వాత కూడా కొనసాగింది. కళాశాలలో చదివిన ఆరుగురు పూర్వవిద్యార్థులు అదే కళాశాలలో ప్రిన్సిపాళ్లుగా కూడా పనిచేశారు.

### ఈ చదువులమ్మకి 104 ఏళ్లు



కె.రాజేశ్వరీమూర్తి

పద్మావతి కళాశాల మహావృక్షమై విలసిల్లడానికి మూలమూర్తి కె.రాజేశ్వరీమూర్తి. కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా రంగనాయకమ్మ రెండేళ్లకాలం (1952-54) వ్యవహరించగా.. 1954నుంచి 1975వరకు 20ఏళ్లపాటు రెండవ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ కె.రాజేశ్వరీమూర్తి కళాశాలకు అన్ని హంగులూ అమర్చి రూపురేఖలు దిద్దారు. భవనాలు, మౌలిక వసతులు మొదలు ప్రతిదీ ఆమె ఆలోచనల్లోంచే పురుడుపోసుకున్నాయి. ఆమె ప్రగతిశీల ఆలోచనా విధానం ఎన్నో కొత్త కోర్సులకు బీజం వేసింది. రాజేశ్వరీమూర్తి కృషి ఫలితంగా 1965లోనే యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ గుర్తింపు కళాశాలకి లభించింది. 1975లో అమెరికా వెళ్లిపోయిన రాజేశ్వరీమూర్తి కొలంబియా వర్సిటీలో చేరి దానికి పాలనాధికారి కూడా అయ్యారు. ప్రస్తుతం 104 సంవత్సరాలు వయసు ఉన్న రాజేశ్వరీ న్యూయార్క్‌లో నివసిస్తున్నారు. ఇక్కడి నుంచి ఎవరు ఎప్పుడు ఫోన్‌చేసి పలకరించినా పద్మావతి కబుర్లతో పులకించిపోతారని తెలుగు విభాగ రిటైర్డ్ హెడ్ డీఎం ప్రేమావతి అంటున్నారు.

### రాయలు కాలపు కోనేరు



కోనేటిలోకి దారి

కళాశాల ప్రాంగణంలో శ్రీనివాస హాస్టల్ ఎదురుగా ఇప్పటికీ శ్రీకృష్ణదేవరాయల కాలానికి చెందిన వందల ఏళ్లనాటి పురాతన బావి (కోనేరు) ఉంది. వందలాది మంది దీనికి నాలుగువైపులా కూర్చుని సేదతీరేలా అప్పట్లో నిర్మించారు. విద్యార్థులు ప్రశాంత చదువుకు తోడు మూన్‌డిన్నర్స్, సంగీత కచ్చేరి వంటివి ఇక్కడ నిర్వహిస్తుంటారు. దీని నిర్మాణంలోని కళాకృతులు సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. అలాగే ప్రాంగణంలో శిథిలావస్థకి చేరిన పురాతన గుడి.. దానికి ఎదురుగా పురాతన బావి ఉంది.

### నేడు వ్యవస్థాపక దినోత్సవం

కళాశాల ఏర్పాటై ఆదివారంతో 72 వసంతాలు పూర్తి చేసుకుంది. సెలవుదినం కావడంతో కళాశాల వ్యవస్థాపకదినోత్సవాన్ని సోమవారం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. అందుబాటులో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులను ఆహ్వానించామని తెలిపారు. సిల్వర్, గోల్డెన్ జూబ్లీలను పూర్తి చేసుకున్న ఈ కళాశాల.. మరో రెండేళ్లలో 75 వసంతాల వజ్రోత్సవాలకు చేరువ కానుండడం విశేషం.





## అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి శ్యామ్‌సుందర్

తిరుచానూరు, ఆగస్టు 10: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు జస్టిస్ శ్యామ్‌సుందర్‌కు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.66 కోట్లు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.66 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 65,131 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,998 మంది తలనీలాలు సమర్పించారు.

## తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, డీఐజీ ప్రవీణ్, నల్గొండ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రఘోత్తమరెడ్డి, దామోదర్ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ప్రవీణ్

# పార్కింగ్ చేసిన వాహనాల్లో డీజిల్ చోరీ

- సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు

పాకాల, ఆగస్టు 10: పార్కింగ్ చేసిన వాహనాల నుంచి రాత్రుల్లో డీజిల్ చోరీ చేస్తున్న నిందితులు సీసీ కెమెరాలకు చిక్కారు. మండలంలోని నేంద్రగుంట పెట్రోల్ బంక్ సమీపంలో పార్కింగ్ స్థలముంది. స్థానికులు, ట్రాక్టర్లు, ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు విశ్రాంతి కోసం ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఇటీవల పార్కింగ్ చేసిన నాలుగు ఐషర్ వాహనాలు, రెండు ట్రాక్టర్లలో డీజిల్ చోరీ అవుతున్నట్లు వాహన యజమానులు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి డీజిల్ చోరీ జరిగినట్లు గుర్తించి, శనివారం ఉదయం సమీపంలోని సీసీ కెమెరాల పుటేజిని పరిశీలించారు. ఓ యువకుడు రాత్రి సమయంలో డీజిల్ చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించి, పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గాదంకి, అగ్రహారం, మద్దినాయనిపల్లె, ఎస్ఆర్‌పురంకు చెందిన నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



పార్కింగ్ చేసిన వాహనాల్లో డీజిల్ చోరీ చేస్తూ సీసీ కెమెరాలకు చిక్కిన నిందితుడు

## తిరుమలనగర్ వాసులకు భద్రత కల్పించండి

మంగళం, ఆగస్టు 10: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ అటవీ ప్రాంతానికి అనుకుని ఉండటంతో ఇక్కడ తరచూ కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని, అలాగే ఎర్ర చందనం, గంజాయి స్మగ్లర్ల ఆగడాల నుంచి ప్రజలకు భద్రత కల్పించాలని ఆ పంచాయతీ టీడీపీ మాజీ అధ్యక్షుడు గోవిందరాజులు సీఐ సునీల్‌కుమార్‌ను కోరారు. తిరుచానూరు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌కుమార్‌ను శనివారం పలువురు టీడీపీ నేతలతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు లంకిపల్లి డిల్లీబాబు, పంచాయతీ వార్డు మెంబర్ వల్లేరు రాధాకృష్ణ, జనార్ధన్, గంగా, సుధాకర్, దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీఐ సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న తిరుమలనగర్ టీడీపీ నాయకులు

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం

చంద్రగిరి, ఆగస్టు 10: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడవీధుల్లో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండా ఎగుర వేసిన ఉపాధ్యాయులు

చంద్రగిరి, ఆగస్టు 10: చంద్రగిరిలో మండలంలోని ఉపాధ్యాయులు యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు యూటీఎఫ్ జెండాను ఎగుర వేశారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు రాజేంద్రబాబు మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తుందన్నారు. యూటీఎఫ్ నాయకులు మునిచంద్ర నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ధనంజయ, కోశాధికారి చెంచయ్య, సహాధ్యక్షుడు రామిరెడ్డి, కార్యకర్తలు హరికుమార్, హరిప్రసాద్, ప్రసన్న, శ్రీరాములు, రెడ్డిప్రసాద్, చంద్రశేఖర్, లలితకుమారి, మధు, పాకిజా, విజయభాస్కర్, రమణమూర్తి, గోపాలకృష్ణ, కృష్ణమూర్తిరెడ్డి, సిద్దయ్య, బాలమురళి, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులా మారిన పశువుల ఆస్పత్రి



చెరువులా మారిన పశువుల ఆస్పత్రి ఆవరణం

భాకరాపేట, ఆగస్టు 10: చిన్నగొట్టిగల్లు పశువుల ఆస్పత్రి ఆవరణం శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులా మారిపోయింది. పశువుల ఆస్పత్రి ముందర గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు వేశారు. అది ఆస్పత్రి ఆవరణ కంటే ఎత్తుగా ఉండటం వలన చుట్టుపక్కల పడిన వర్షపు నీరు అంతా ఆస్పత్రి ఆవరణలోకి వచ్చి నిలిచిపోయింది. దీంతో అది చెరువుగా మారిపోతుంది. రోడ్డు నిర్మించేటప్పుడు అక్కడ కల్వర్టు ఏర్పాటు చేయకపోవడం వల్ల నీరు వెళ్లే మార్గం లేక నిలిచిపోవడంతో ఆస్పత్రికి పశువులను తీసుకువచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మాతమ్మకు సారె సమర్పించిన నాని

రామచంద్రాపురం, ఆగస్టు 10: బ్రాహ్మణకాల్వ, వడ్డికాల్వ గ్రామాల్లో జరుగుతున్న మాతమ్మ ఉత్సవాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం సారె సమర్పించారు. నిర్వాహకులు నానీకి స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు, జిల్లా నాయకులు జనార్ధన చౌదరి, హరిప్రసాద్, నరసింహారెడ్డి, డిల్లీనాథరెడ్డి, సురేంద్ర నాయుడు, జయచంద్ర నాయుడు, మాధవయ్య పాల్గొన్నారు.



## హాకీ క్రీడాకారుల సంబరాలు



చంద్రగిరి, ఆగస్టు 10: ప్యారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో పురుషుల హాకీ క్రీడలో స్పెయిన్ జట్టుపై ఇండియా జట్టు 2-1 గోల్స్‌తో విజయం సాధించి, కాంస్య పతకాన్ని గెలుపొందిన సందర్భంగా చంద్రగిరిలో హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు శనివారం సాయంత్రం సంబరాలు జరుపుకొన్నారు. హాకీ క్రీడాకారులు చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీగా చేరుకుని, బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి, అందరికీ పంచి పెట్టారు. ఈకార్యక్రమంలో హాకీ క్రీడాకారులు శ్రీనివాసుల ఆచారి, శ్రీనివాసులరెడ్డి, హరికృష్ణ, రూప్‌కుమార్‌రెడ్డి, లవకుమార్‌రెడ్డి, రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## జిల్లావాసులకు హెల్పింగ్ హ్యాండ్స్ పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభావిశేషాలు కనబరచిన కళాకారులకు, నిపుణులకు తెలంగాణలోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పురస్కారాలను అందజేసి, సత్కరించింది. శనివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వీరికి అల్లూరిసీతారామరాజు, ఎన్టీఆర్, రాజీవ్ గాంధీ తదితర మహనీయుల పేరు మీద పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలు అందుకున్నవారిలో పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటకరంగ నిపుణుడు ఖాదర్ బాషా షేక్, తిరుపతికి చెందిన చిత్రకళా నిపుణురాలు బత్తుల అర్చన, స్క్రిప్ట్ రచయిత షేక్ గౌస్ బాషా, పద్యకవి జలకనూరి మురళీధరరాజు, ఏఎస్ఐ దిగళ్ప్రసాద్‌రాజు, సిందిరి సత్యనారాయణ, కళాకారుడు డాక్టర్ తుంగ యోగేష్‌బాబు, ఆంగ్ల భాషా బోధకురాలు కె.విజితయోగేష్, యాదమరిప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారి ఏ.లక్ష్మీనారాయణ తదితరులకు తెలంగాణ బీసీ కమిషన్ అధ్యక్షులు వకుళాభరణం కృష్ణమోహన్, మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సినీప్రముఖుడు దైవజ్ఞశర్మ, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు సరోజినిమ్మ ఘనంగా సత్కరించారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ

తిరుపతి(విద్య), ఆగస్టు 10: జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న ప్రకటించారు. శనివారం తిరుపతిలో ఎస్ఎఫ్ఐ నాయకులతో సమావేశమైన ఆయన నూతన కమిటీని ఎంపికచేసి నియమించారు. ఆమేరకు... జిల్లా అధ్యక్షుడుగా అక్బర్, ప్రధాన కార్యదర్శిగా భగత్‌రవి, ఉపాధ్యక్షులుగా తిరుపతికి చెందిన వినోద్, చంద్రగిరి చెందిన తేజ, పుత్తూరుకు చెందిన ఉమేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా సుస్మిత, నరేంద్ర, బాల గురవయ్య ఎంపికయ్యారు. మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా, 10 మంది కమిటీ సభ్యులుగా నియమించినట్లు ప్రసన్న ప్రకటించారు.

# అనుమానాస్పద స్థితిలో ఎస్వీయూ ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి



ప్రియా (ఫైల్)

ఒంగోలు(క్రైం)/తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 10: ఎస్వీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని ఒంగోలులో శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన చప్పిడి ప్రియాంక(20) ఎస్వీయూలో బీటెక్ చదువుతోంది. ఈమెకు సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్లపాడుకు చెందిన దాసరి శివకళ్యాణ్‌తో నాలుగేళ్లుగా ప్రేమవ్యవహారం ఉంది. 2023 మార్చిలో పి.తక్కెళ్లపాడు చర్చిలో వారికి వివాహమైంది. ప్రేమ, పెళ్లి వ్యవహారం తల్లిదండ్రులకు తెలియకుండా ప్రియాంక జాగ్రత్త తీసుకుంది. నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటున్న ఆమె తన తల్లిదండ్రులకు మాత్రం తిరుపతిలో ఉంటున్నట్లు చెప్పింది. ఈ క్రమంలో ఈనెల 8న ప్రియాంకకు ఓ ప్రైవేటు వైద్యశాలలో పరీక్షలు చేయించాడు శివకళ్యాణ్. ఆరు నెలలు గర్భవతి అని అక్కడి డాక్టర్ చెప్పారు. 9వతేదీ రాత్రి ప్రియాంకకు ఫిట్స్ వస్తే ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు అతడు చెబుతున్నాడు. అప్పటికే యువతి మృతి చెందినట్లు రిమ్స్ డాక్టర్లు నిర్ధారించారు. రిమ్స్‌లో ప్రియాంక భర్తగా శివకళ్యాణ్ పేరు నమోదు చేయించాడు. ప్రియాంక మృతి చెందినట్లు తెలియడంతో అక్కడినుంచి తన స్నేహితులతో కలిసి పరారయ్యాడు.

### మృతిపై అనుమానాలు

ప్రియాంక మృతిపై వైద్యులు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో శివకళ్యాణ్.. ప్రియాంక తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తిరుపతి నుంచి ట్రైన్‌లో వస్తున్న యువతి స్పృహ తప్పి పడిపోయిందని చెప్పడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. యువతి గర్భవతి కావడంతో అబార్షన్ చేయించేందుకు మందులు వాడటంతో ఆమె నోటి వెంట నురుగు వచ్చిందని వారు చెబుతున్నారు. తన బిడ్డ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని తల్లి చప్పిడి అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### దర్యాప్తు చేస్తున్నాం: ఒంగోలు రూరల్ సీఐ

బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రియాంక నెలరోజులుగా పి.తక్కెళ్లపాడులో ఉంటుందని తెలిపారు. శివకళ్యాణ్‌ను విచారించగా.. తాము నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, 2023 మార్చిలో చర్చిలో వివాహం చేసుకున్నట్లు చెప్పాడన్నారు.అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని సీఐ చెప్పారు. కాగా, ఈ ఘటనపై ఎస్వీయూ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మురళీమోహన్ తెలిపారు.

# శంకరంబాడికి ఘననివాళి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: మాతెలుగు తల్లికి మల్లెపూదండ మాకన్న తల్లికి మంగళారతులు అన్న రాష్ట్ర కవి, దివంగత శంకరంబాడి సుందరాచారి జయంతి కార్యక్రమాన్ని నగరంలోని లక్ష్మీపురం కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద శనివారం సాహితీ సంస్థలు ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డి.మస్తానమ్మ(శంకరంబాడి సాహితీపీఠం), సాకం నాగరాజు (అధ్యక్షుడు, తిరుపతి జిల్లా రచయితల సంఘం), యువశ్రీమురళి (అధ్యక్షుడు, తిరుపతి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం), తమటం రామచంద్రారెడ్డి (తెలుగు భాషోద్యమ సమాఖ్య), ఏనుగు అంకమ నాయుడు(విశ్వశ్రీ సాహితీ సమాఖ్య), మల్లారపు నాగార్జున(వేమన విజ్ఞానకేంద్రం), గుండాల గోపినాథ్ రెడ్డి(అధ్యక్షుడు,రాయలసీమ రంగస్థలి), హరిసర్వోత్తమ నాయుడు(ఉపాధ్యక్షుడు, శ్రీశ్రీ కళావేదిక), కథారచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, గజేంద్రరెడ్డి, నిర్మల, నాగయ్య, షరీఫ్ తదితరులు పాల్గొని శంకరంబాడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ.. తిరుపతిలో శంకరంబాడి విగ్రహం వద్ద రోజూ మాతెలుగు తల్లికి గీతం వినిపించే ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా శంకరంబాడి జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.


శంకరంబాడి సుందరాచారికి నివాళి అర్పిస్తున్న తెలుగు సంఘాలు

### ఆపస్ ఆధ్వర్యంలో..



తిరుపతి(విద్య): మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయ రచయిత స్వర్గీయ శంకరంబాడి సుందరాచారికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు నివాళులర్పించారు. శనివారం శంకరంబాడి జయంతిని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీపురం కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, సహాధ్యక్షుడు దేవరాజులు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రజాదర్బార్‌కు స్పందన


వినతిపత్రం స్వీకరిస్తున్న నరసింహ యాదవ్

తిరుపతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్‌కు పలువురు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా శెట్టిపల్లి ప్లాట్ల సమస్య, రేణిగుంట నుంచి కడప వరకు ప్రారంభించిన హైవే విస్తరణలో కరకంబాడి దగ్గర భూములు కోల్పోయిన వారి నష్టపరిహారం గురించి అనేక వినతులు వచ్చాయి. వైసీపీ హయాంలో ఆక్రమణకు గురైన చెరువులను సర్వే చేయించి, వెంటనే వాటి అభివృద్ధికి రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకొనేలా కృషి చేయాలని పలువురు కోరారు. తిమ్మినాయుడుపాలెం హరిజనవాడకు శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు శ్రీధర్ వర్మ, ఊట్ల సురేంద్ర నాయుడు, మనోహర్ ఆచారి, రవి శంకర్, శంకర్ యాదవ్, శ్రీనివాస్, రెడ్డప్ప నాయుడు, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యలో నూతన అధ్యయనాలపై దృష్టి పెట్టాలి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 10: వైద్య విద్య రంగంలో చోటుచేసుకుంటున్న నూతన అధ్యయనాలపై వైద్య విద్యా బోధకులు, వైద్య విద్యార్థులు దృష్టి పెట్టాలని, అప్పుడే కొత్త మార్పులకు అవకాశం ఉంటుందని వైద్య విద్యా సంచాలకులు(అకాడమిక్) రఘునందన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో శనివారం జరిగిన 14వ వార్షిక ఏపీ మెడికాన్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య విద్యలో చోటుచేసుకుంటున్న మార్పులు, అధునాతన పద్ధతులు, సాంకేతికత వైద్య పరిజ్ఞానాలపై వైద్య అధ్యాపకులకు వివరించారు. ప్రముఖ వైద్య నిపుణులు పీయుష్ గుప్తా, విష్ణు భట్, మహాలక్ష్మీ, ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్‌లో గీతం విద్యార్థికి బంగారు పతకం


ముఖేష్‌ను అభినందిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

తిరుపతి(విద్య), ఆగస్టు 10: భవానీనగర్‌లోని గీతం జూనియర్ కళాశాల విద్యార్థి వై.ముఖేష్‌సాయి యాదవ్ భూటాన్‌లో నిర్వహించిన అండర్-17 ఏషియన్ ఛాంపియన్‌షిప్(బాక్సింగ్)లో రాణించి బంగారు పతకం సాధించాడని చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బాక్సింగ్‌లో ఈవిద్యార్థి ఇప్పటివరకు 16 గోల్డ్‌మెడల్స్ సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థిని ఆయనతోపాటు చైర్‌పర్సన్ పాలడుగు విజయ, ప్రిన్సిపాల్ బీవీ గోపీనాథ్, అధ్యాపకులు అభినందించారు.

# పార్కుల అభివృద్ధికి కృషి

### కచ్చపి ఆడిటోరియం అద్దె తగ్గించాం: కమిషనర్



తిరుపతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పార్కుల అభివృద్ధికి కృషిచేస్తున్నామని, పార్కుల్లో ఉండే ఊపిరితిత్తుల వ్యాధులను కలగజేసే మోనోకార్పస్ చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలకసంస్థ కమిషనర్ మౌర్య చెప్పారు. శనివారం కచ్చపి ఆడిటోరియంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన కచ్చపి ఆడిటోరియాన్ని అద్దెకిచ్చే ధరలు తగ్గించామని చెప్పారు. గతంలో డిపాజిట్‌తో కలిపి రూ.70వేలు ఉంటే రూ.40వేలకు తగ్గించామన్నారు. చిన్న ఫంక్షన్లు చేసుకునే బాంకెట్ హాలును రూ.15వేలకే అందిస్తున్నామని తెలిపారు. భూగర్భ విద్యుత్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రధాన రోడ్లపై ఉన్న కేబుల్ వైర్లను తొలగిస్తామని, దీనిపై కేబుల్ యాజమాన్యంతో త్వరలోనే సమావేశం ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. నగరంలో యూడీఎస్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, పునర్నిర్మాణం కోసం దాదాపు రూ.60కోట్లు నిధులు అవసరమన్నారు. ప్రభుత్వం, టీటీడీ ముందుకొస్తేనే అదిసాధ్యపడుతుందన్నారు. వర్షాకాలంలో వరద ముప్పునుంచి ముందస్తుగా కాలువల్లో పూడికతీయడం మొదలుపెట్టామన్నారు. కార్పొరేషన్లో నిధులులేవని, వచ్చే పన్నులతోనే పనులను పూర్తిచేయాల్సి వస్తోందన్నారు.

## వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

- రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీ చేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 10: వయనాడ్ బాధితులను ఆదుకుందామని తిరుపతి రోటరీ క్లబ్ ప్రతినిదులు కోరారు. శనివారం వారు తిలక్‌రోడ్‌లోని రోటరీ భవన్ నుంచి శ్రీదేవి కాంప్లెక్సు వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ప్రకృతి విపత్తులో చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దాతల సాయంతో వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రోటరీక్లబ్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి రాజేష్‌కుమార్, జోన్ గవర్నర్ హేమచందర్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, వేమన విజ్ఞాన కేంద్రం, ఈశా ఫౌండేషన్, తిరుపతి బాలోత్సవం, వే ఫౌండేషన్, రిచ్ గ్లోబల్ ఫౌండేషన్, గోవిందధామం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రామకృష్ణ ఆశ్రమంలో ముగిసిన సదస్సులు


ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: తిరుపతి రామకృష్ణ ఆశ్రమ 9వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఉదయం ఉపాధ్యాయ సదస్సు జరిగింది. ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఉపాధ్యాయ సదస్సులో ముఖ్యఅతిథి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి(ఉప కులపతి, సంస్కృత విశ్వవిద్యాలయం) మాట్లాడుతూ... రామకృష్ణ మిషన్ సమాజసేవ చేస్తోందన్నారు. యువతరం అంకితభావంతో ఉపాధ్యాయవృత్తిని నిర్వహించాలని హితవుపలికారు. గౌరవ అతిథి ఎస్. సత్యనారాయణ రాజు (సంచాలకులు, భారతీయ విద్యాభవన్), ఆచార్య ఎ.రఘురామరాజు (ఐఐటీ, తిరుపతి), స్వామి శశికాంతానంద(రాజమహేంద్రవరం), స్వామి అనుపమానంద (కడప) వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. ఈ సదస్సులో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, స్వామి సత్వస్థానంద, ఆచార్య పీవీ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయంత్రం ఆరుగంటల నుంచి విష్ణుసహస్రనామ పారాయణం, ఆరాత్రికం, భజనలు జరిగాయి.

# ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

తిరుపతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం ఎన్జీవో హోమ్‌లో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఉద్యోగులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వ్యవహారశైలితో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎన్నో అవస్థలు పడ్డారని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీతాలను ఒకటవ తేదీకే ఇస్తోందని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులకు మూడు నెలలకోసారి వైద్యపరీక్షలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పెన్షనర్ల సంఘం పేరిట దౌర్జన్యంగా భవనాన్ని నిర్మించారని ఎమ్మెల్యే దృష్టికి రిటైర్డ్ ఉద్యోగులు తీసుకురాగా, అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నాయకులు బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, రమణరాజు, జనసేన నాయకులు రాజా రెడ్డి, లోకేష్, బాబ్జి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు వెంకటేశం శెట్టి, ఎస్‌జీ మునికృష్ణయ్య, సిద్ధయ్య, గోపాల్, బి.వెంకటరమణ, చింతకాయల కృష్ణయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో బలిజ వివాహ పరిచయవేదిక


సమావేశమైన బలిజ ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 10: తిరుపతి నగరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సహకారంతో త్వరలో బలిజ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేయనున్నట్లు బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నీలం నరేంద్రనాథ్ వెల్లడించారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో శనివారం సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ విభాగాల్లో బలిజ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారి పిల్లలకు వివాహలు చేయడానికి సులభతరంగా ఉండేవిధంగా ఈ పరిచయవేదిక ఉపయోగపడుతుందని చెప్పారు. గౌరవాధ్యక్షుడు ఎస్.మునిశంకరయ్య, శాశ్వత అధ్యక్షుడు పి.సత్యనారాయణ నాయుడు, ప్రధాన కార్యదర్శి టి.అశోక్‌కుమార్, కమిటీ నాయకులు జయప్రకాష్, పి.బాలాజీ, సురేష్, చంద్రశేఖర్, జీపీ రాజు, తోట మధుసూదన, కిషోర్, వెంకటేష్, రవి కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## 9వ ఇంటర్‌స్టేట్ ఓపెన్ తైక్వాండో పోటీలు విజయవంతం


మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకున్న తైక్వాండో విజేతలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన 9వ ఇంటర్ స్టేట్ ఓపెన్ తైక్వాండో పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి దాదాపు 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో శరీరబరువు, ఎత్తు, వయస్సు ఆధారంగా బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ అమెచ్యూర్ తైక్వాండో సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు ఊకా విజయ్‌కుమార్ చేతుల మీదుగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందచేశారు.చీఫ్ రెఫ్రీగా తమిళనాడుకు చెందిన సుదర్శన్ వ్యవహరించారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి బాలకృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, ఆనంద్, వెంకటేష్, రవిశంకర్, మునీశ్వర్ పాల్గొన్నారు.

## అక్షయక్షేత్రానికి నిత్యావసరాల సాయం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: తిరుపతికి చెందిన సంస్కృత వికాశ సంస్థాన్ ట్రస్ట్ (ఎస్ఎస్‌వీఎస్)ఆధ్వర్యంలో శనివారం తిరుపతి రూరల్ రామాపురంలోని అక్షయక్షేత్రానికి అవసరమైన పాత్రలు, ఆహారం, పప్పులు, నెయ్యి వంటి నిత్యావసరాలను అందజేశారు. దుస్తులనుకూడా పంపిణీ చేశారు. ట్రస్టుకు చెందిన ఆచార్య దక్షణామూర్తి, ఆచార్య సచ్చిదానందమూర్తి, రాధాగోవింద త్రిపాఠి, అక్షయక్షేత్రం నిర్వాహకుడు రఘురామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో సదస్సు



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 10: పద్మావతి మహిళా వర్సిటీలో ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌ట్రా సెల్యులార్ వేసికల్ రెవల్యూషన్(ఈవీ) అనేఅంశంపై సదస్సు నిర్వహించారు. అపోలో హాస్పిటల్స్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ శాస్త్రవేత్త డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ పురోగతి, న్యూరోడెజెనరేటివ్ వ్యాధులలో ఈవీల పనితీరుని విశదీకరించారు. డ్రగ్ డెలివరి సామర్థ్యం, కొత్తచికిత్సలను అభివృద్ధి చేయడంలో ఈవీల పాత్రని వివరించారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.జోత్స్నారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీటీడీ పాలకమండలిలో నటుడు సుమన్‌కు అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 10: అన్నమయ్య సినిమాతో శ్రీవారి పాత్రకు జీవం పోయడమే కాకుండా శ్రీవారి భక్తుల మన్ననలు పొందిన గొప్ప సినీ నటుడు సుమన్‌కు టీటీడీ పాలక మండలిలో అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు నారాయణ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం సుమన్ యువసేన నేతలు సురేంద్ర నాయుడు, మాధవ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలోనూ, ఈ ఎన్నికల్లో కూడా సుమన్ టీడీపీకి, పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా నిలిచారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఆయనకు టీటీడీలో అవకాశం కల్పించాలని వారు కోరారు. సుమన్ యువసేన నేతలు నాగవర్ధన్, హేమంత్ పాల్గొన్నారు.

## అలరించిన నృత్యపోటీలు





తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: మన సంస్కృతి సంప్రదాయాలను, కళలను ఆదరించాలని, యువతకు నేర్పించాలని పలువురు అతిథులు పిలుపునిచ్చారు. తిరుపతి మహతి క్షేత్రంలో రెండో రోజు శనివారం జరిగిన శ్రీకృష్ణదేవరాయ జాతీయ సంగీత, నృత్యపోటీలలో భాగంగా జరిగిన సభలో తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జి.నరసింహ యాదవ్, నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, ఆర్సీ మునికృష్ణ, సింగంశెట్టి సుబ్బరామయ్య, కస్పా పద్మనాభన్ పాల్గొన్నారు. అనంతరం వీరు కళాకారులు బి.దుర్గాప్రసాద్, నాగశశికళ, ఏనుగు శివాజి నాయుడు, సుంకర రవికుమార్‌లకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలు, ఎస్ఎస్‌వి అపర్ణ, లక్ష్మీ సుహిత, బి.వర్షిణిలకు నాట్యరంజిత పురస్కారాలను అందజేశారు. ఈ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు జరుగుతాయి. సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి, కార్యదర్శి కెఎస్ రాజ, శ్రీరాములుయాదవ్, టి.సుబ్రమణ్యం,కొత్తపల్లి మునిరత్నం,చెంగారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్పీజేఎన్‌ఎం క్రీడా మైదానాన్ని వ్యాపారాత్మకం చేయరాదు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 10: తిరుపతిలోని ఎస్పీజేఎన్‌ఎం పాఠశాల క్రీడా మైదానాన్ని వ్యాపారాత్మకం చేయరాదని బీజేపీ కౌన్సిల్ మెంబర్ భక్తవత్సలం ఒప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యార్థుల క్రీడలపట్ల నిర్లక్ష్యం వహించిందని, దీంతో అప్పటి మున్సిపల్ అధికారులు ఈ మైదానాన్ని ఎగ్జిబిషన్లు తదితరాలకు వినియోగించుకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని, ఇకపై పాఠశాలల క్రీడా మైదానాలను వ్యాపార కార్యక్రమాలకు వినియోగించరాదని ఆయన డిమాండ్ చేశారు.

# ఉద్యోగులకు 18 నెలల డీఏలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న యూనియన్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 10: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 18 నెలల డీఏను వెంటనే చెల్లించడంతోపాటు 2016 సంవత్సరానికి రావాల్సిన అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. యూనియన్ నేతలతో కలిసి ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం గుర్తింపు సంఘాలుగా చెలామణి అవుతున్న సంఘాల కాలపరిమితి 2017లో ముగిసినా ఆ సంఘాలు ఇంకా కొనసాగుతున్నాయని, రైల్వే బోర్డు వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే యాజమాన్యం చట్ట విరుద్ధంగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తుండటం వలన ఉద్యోగులకు న్యాయం జరగడం లేదని, సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు రవీంద్ర నాయుడు, రామాంజనేయులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## 30న వరలక్ష్మీవ్రతం


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 10: తిరుపతి బ్రాహ్మణ సమాజం కార్యవర్గ సమావేశం శనివారం ఒక ప్రైవేటు హోటల్లో జరిగింది. భీమాస్ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 19వ తేదీ సోమవారం స్థానిక కంచి మఠంలో జంధ్యాలపండుగ నిర్వహిస్తారు. అనంతరం ఈ నెల 30న వరలక్ష్మీ వ్రతం నిర్వహించాలని నిర్ణయించారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక శంకరమఠం(రాములవారిగుడి సన్నిధివీధి)లో వ్రతం జరుగుతుంది. రూ.250 చెల్లించి గృహస్థులు ఈ వ్రతంలో పాల్గొన వచ్చు. వీరికి పూజానంతరం వెండి లక్ష్మీదేవి ప్రతిమ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకోసం కన్వీనర్లు వేదం హరిప్రసాద్ 99493 339851, ఎం.నరసింహాచార్య 90528 44442, విజయకుమార్ 83095 68361, ఎం.గంగాధరరావు 76758 80344 నెంబర్లలో సంప్రదించవచ్చును.

## టీటీడీ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తాం

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 10: వచ్చే నెలలో జరగనున్న టీటీడీ ఉద్యోగుల బ్యాంకు ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి గెలిపిస్తే ఉద్యోగుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన ప్యానల్ అభ్యర్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. మరోసారి తనకు, తన ప్యానల్ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే ఉద్యోగులకు, వారి బిడ్డలకు చక్కటి సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చే విధం గా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన ప్యాన ల్ సభ్యులు గుంటూరు రేఖ, పవన్, మణికంట, సునీల్‌కుమార్ యాదవ్‌ల పేర్లను ప్రకటించారు. నేతలు గోపికుమార్‌రెడ్డి, వెంకటేశ్వరబాబు, ఉమాశంకర్, గుణ తదితరులు పాల్గొన్నారు.


ఫిష్‌మార్కెట్ వద్ద..


శనివారం కురిసిన వర్షానికి తిరుపతిలోని సెవెన్‌హిల్స్ స్కూల్ వద్ద నిలిచిన నీరు


పూలవానిగుంట వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ్మాయిల కోసమే మొదలైన పద్మావతి కాలేజీ నేడు 72వ వసంతంలోకి ప్రవేశిస్తోంది. మహిళల సాధికారతకు సగౌరవ చిహ్నంగా నిలుస్తోంది. టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో 1952 ఆగస్టు 11న 25మంది విద్యార్థులు, 8మంది అధ్యాపకులతో ప్రారంభమైన పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ఇప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించి చదువుల మహావటవృక్షమై విలసిల్లుతోంది.

తొలి మహిళా కళాశాల

# పద్మావతికి 72 ఏళ్లు

ప్రత్యేక కథనం తిరుపతి రూరల్

ఆంధ్ర రాష్ట్రంలో తొలి మహిళా కళాశాల ఏర్పాటులో అప్పటి టీటీడీ ఈవో అన్నారావు కృషి ఎనలేనిది. తొలినాళ్లలో మద్రాస్ వర్సిటీకి అనుబంధంగా ప్రారంభమైన పద్మావతి కళాశాల.. ప్రస్తుతం 28 విభాగాలతో 2800 మంది విద్యార్థినులతో సరస్వతి క్షేత్రంగా విరాజిల్లుతోంది. 2022లో 3.43 హైయస్ట్ స్కోర్‌తో న్యాక్ ఏప్లస్ గ్రేడ్ గుర్తింపును సాధించగా.. 2024 జనవరిలో యూజీసీ అటానమస్ హోదాను సంతరించుకుంది. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్యతోపాటు భోజన, వసతి సౌకర్యాలను కూడా ఉచితంగా అందిస్తున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ప్రత్యేక శిక్షణ కోసం ఎన్‌సీసీ(ఆర్మీ)వింగ్‌తో రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లను నిర్వహిస్తుండడం ప్రత్యేకత. విద్యార్థుల శారీరక వికాసానికి గేమ్స్ అండ్‌స్పోర్ట్స్ విభాగం, నైపుణ్యాల పెంపునకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్లేస్‌మెంట్ కేంద్రాన్ని నడుపుతున్నారు. కళాశాలకు అనుబంధంగా 8బ్లాక్‌లలో 2,100 మంది విద్యార్థులకు సరిపడా వసతిగృహాలు అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం 1,850మంది విద్యార్థులు వసతిగృహంలో ఉండి విద్యాభ్యాసం చేస్తున్నారు. కాగా విద్యారంగంలో పెనుమార్పులు జరిగినా తన ఉనికిని కాపాడుకుంటూ స్థాయిని తగ్గించుకోకుండా విద్యాపరంగా మంచి డిమాండ్ ఉన్న కళాశాలగా పద్మావతి కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రస్తుతం డాక్టర్ టి.నారాయణమ్మ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

### చదివినచోటే కొలువులు

*1965-67లోనే దాదాపు 30మంది పూర్వవిద్యార్థినీలు అదే కళాశాలలో అధ్యాపకులుగా చేరడం పద్మావతి కళాశాల ప్రత్యేకత. ఈ చదువుల వారసత్వం తర్వాత కూడా కొనసాగింది. కళాశాలలో చదివిన ఆరుగురు పూర్వవిద్యార్థులు అదే కళాశాలలో ప్రిన్సిపాళ్లుగా కూడా పనిచేశారు.*



చారిత్రక సాక్ష్యం

### ఈ చదువులమ్మకి 104 ఏళ్లు



కె.రాజేశ్వరీమూర్తి

పద్మావతి కళాశాల మహావృక్షమై విలసిల్లడానికి మూలమూర్తి కె.రాజేశ్వరీమూర్తి. కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా రంగనాయకమ్మ రెండేళ్లకాలం (1952-54) వ్యవహరించగా.. 1954నుంచి 1975వరకు 20ఏళ్లపాటు రెండవ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ కె.రాజేశ్వరీమూర్తి కళాశాలకు అన్నిహంగులూ అమర్చి రూపురేఖలు దిద్దారు. భవనాలు, మౌలిక వసతులు మొదలు ప్రతిదీ ఆమె ఆలోచనల్లోంచే పురుడుపోసుకున్నాయి. ఆమె ప్రగతిశీల ఆలోచనా విధానం ఎన్నో కొత్త కోర్సులకు బీజం వేసింది. రాజేశ్వరీమూర్తి కృషి ఫలితంగా 1965లోనే యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ గుర్తింపు కళాశాలకి లభించింది. 1975లో అమెరికా వెళ్లిపోయిన రాజేశ్వరీమూర్తి కొలంబియా వర్సిటీలో చేరి దానికి పాలనాధికారి కూడా అయ్యారు. ప్రస్తుతం 104 సంవత్సరాలు వయసు ఉన్న రాజేశ్వరీ న్యూయార్క్‌లో నివసిస్తున్నారు. ఇక్కడి నుంచి ఎవరు ఎప్పుడు ఫోన్‌చేసి పలకరించినా పద్మావతి కబుర్లతో పులకించిపోతారని తెలుగు విభాగ రిటైర్డ్ హెడ్ డీఎం ప్రేమావతి అంటున్నారు.

### రాయలు కాలపు కోనేరు



కోనేటిలోకి దారి

కళాశాల ప్రాంగణంలో శ్రీనివాస హాస్టల్ ఎదురుగా ఇప్పటికీ శ్రీకృష్ణదేవరాయల కాలానికి చెందిన వందల ఏళ్లనాటి పురాతన బావి (కోనేరు) ఉంది. వందలాది మంది దీనికి నాలుగువైపులా కూర్చుని సేదతీరేలా అప్పట్లో నిర్మించారు. విద్యార్థులు ప్రశాంత చదువుకు తోడు మూన్‌డిన్నర్స్, సంగీత కచ్చేరి వంటివి ఇక్కడ నిర్వహిస్తుంటారు. దీని నిర్మాణంలోని కళాకృతులు సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. అలాగే ప్రాంగణంలో శిథిలావస్థకి చేరిన పురాతన గుడి.. దానికి ఎదురుగా పురాతన బావి ఉంది.

### నేడు వ్యవస్థాపక దినోత్సవం

కళాశాల ఏర్పాటై ఆదివారంతో 72 వసంతాలు పూర్తి చేసుకుంది. సెలవుదినం కావడంతో కళాశాల వ్యవస్థాపకదినోత్సవాన్ని సోమవారం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. అందుబాటులో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులను ఆహ్వానించామని తెలిపారు. సిల్వర్, గోల్డెన్ జూబ్లీలను పూర్తి చేసుకున్న ఈ కళాశాల.. మరో రెండేళ్లలో 75 వసంతాల వజ్రోత్సవాలకు చేరువ కానుండడం విశేషం.



## పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

● కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతి

పెళ్లకూరు ఆగస్టు10: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదని, అలాంటి పంచాయతీల అభి వృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం గుంటూరులోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో ఆధ్వర్యంలో పెమ్మసానిని కలసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వంట మాస్టర్ మృతి

బాలాయపల్లి, ఆగస్టు 10: మండల పరిధిలోని నిండలిలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. నిండలి గ్రామానికి చెందిన చంద్రబాబు తిరుపతిలో వంట మాస్టర్‌గా పనిచేసేవాడు. ఎన్నికల ముందు స్వగ్రామానికి వచ్చి ఇల్లు కట్టుకుని శుక్రవారం గృహప్రవేశం చేశారు. ఏమైందో కానీ నిండలి చెరువు కల్వర్టు వద్ద ఆయన అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం శవాన్ని వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## పరిసరాల శుభ్రతపై దృష్టి ఉంచాలి

ఓజిలి, ఆగస్టు 10 : అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన, పరిసరాల శుభ్రతను విధిగా పాటించాలని ఓజిలి ఎంఈవో శైలజ అన్నారు. శనివారం ఓజిలిలోని విద్యా వనరుల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్ఎంసీల ఏర్పాటు పూర్తయిందని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్ఎంసీ కమిటీలతో కలిసి సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

## తగ్గిన చికెన్ ధరలు

గూడూరు అర్బన్, ఆగస్టు 10: కొద్దిరోజులుగా చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. మూడు వారాల క్రితం రూ.300 వరకు ఉన్న కేజీ చికెన్ ప్రస్తుతం చికెన్ ధర సగానికి పడిపోయి రూ. 150 చేరింది. శ్రావణమాసం రావడంతోపాటు చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు అంటున్నారు. ఓ వైపు శ్రావణ మాస ప్రత్యేక పూజల్లో ఆలయాలు రద్దీగా ఉండగా.. చికెన్ దుకాణాలు విక్రయదారులతో కళకళలాడుతున్నాయి. వ్యాపారుల మధ్య పోటీ ఉన్న ప్రాంతాల్లో గరిష్ఠంగా రూ. 120 కూడా విక్రయాలు జరుగుతున్నట్లు ఆయా ప్రాంతాల మాంసప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## నారా లోకేశ్‌ను కలసిన తెలుగుయువత ఉపాధ్యక్షుడు

నాయుడుపేట, ఆగస్టు 10 : రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌బాబును తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసారాజా మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో శనివారం కలసినట్లు పరసారాజా తెలిపారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ




గూడూరు అర్బన్, ఆగస్టు 10: స్థానిక రోటరీభవన్‌లో శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పేదల కు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధులకు చేయూతనందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, దశరథ రామిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

## దొంగకు దేహశుద్ధి



పెళ్లకూరు ఆగస్టు 10 : మండలం లోని అక్కగారిపేటలో శుక్రవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. స్థానికులు సమాచారం మేరకు ఈ గ్రామంలోని ఇలుపూరు సంతోష్‌కుమార్ ఇంట్లో చోరీ చేసేందుకు శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి చొరబడ్డాడు. సంతోష్‌కుమార్ గమనించి కేకలు వేయడంతో పరారయ్యాడు. చుట్టుపక్కల వారు దొంగను పట్టుకుని తాడుతో కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒడిశా రాష్టానికి చెందిన వాడని, అతడికి మతిస్థిమితం లేదని పోలీసులు తెలిపారు.

## జీడిమామిడి, వేరుశనగ పంటలపై సర్వే

కోట, ఆగస్టు10 : మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల గున్నంపడియా, యమదిన్నెపాళెం, చిల్లకూరు మండలం లింగవరం పంచాయతీ పల్లెవానిదిబ్బ సమీపంలో శనివారం పలుశాఖల అధికారులు పంటల సర్వే చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రమణయ్య, సర్వేయర్ రామ్‌కుమార్‌తోపాటు అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. ఇక్కడ ఉన్న 24 ఎకరాల ప్రభుత్వ భూములు చెన్నై, బెంగుళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌లో వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 24 ఎకరాల భూములు సర్వేలో తమపేర్లు నమోదుచేయాలని చిల్లకూరు మండలం పల్లెవానిదిబ్బ వాసులు అధికారులతో వాదోపవాదాలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దారు జయజయరావు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పలుశాఖల అధ్యయన బృందాలు పంటలసాగుపై సర్వే నిర్వహించారు.

# సమస్యలపై నిరంతర పోరాటం : యూటీఎఫ్




గూడూరు, వెంకటగిరిలలో పతాకావిష్కరణ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, సూళ్లూరుపేటలో బైక్‌ర్యాలీ

గూడూరు, ఆగస్టు 10: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతర పోరాటాలు సాగిస్తుందని యూటీఎఫ్ నాయకులు సుధీర్, హరిబాబు అన్నారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవన సమీపంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఓ వైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, పాఠశాల పరిరక్షణ కోసం, విద్యాప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వాసుదేవరావు, నాగేశ్వరరావు, రవి, మురళీసింగ్, గురునాథం, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరిటౌన్:** ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించిందని జిల్లా కార్యదర్శి కుమారస్వామి అన్నారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, రత్నశేఖర్, గంగారావు, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీరాములు, సుధీర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట :** రాష్ట్ర యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బైక్ ర్యాలీ జరిగింది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలశాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ అనేక పోరాటాలతోనే ఉపాధ్యాయుల సంక్షేమం మెరుగుపడిందని, విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. జీవో నంబరు 117ను రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రీనివాసులు, సునీల్, బాబు, సీఐటీయూ నాయ కులు పద్మనాభయ్య, సుధాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్ :** పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆ సంఘ జెండాను ఎగురవేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరులో కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివప్రసాద్, ప్రభుదాస్, శ్రీనివాసులు, వాసు, శంకరయ్య, శేఖర్, రామమూర్తి పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 10: సూళ్లూరుపేట పట్టణ అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్‌ను కోరారు. శనివారం శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్‌ను ఎమ్మెల్యే కలుసుకుని శాలువాతో సత్కరించారు. వచ్చే వారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శ్రీహరికోటకు రానున్న నేపథ్యంలో పర్యటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట అభివృద్ధికి తగినంత సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, బొమ్మన ఫణి, ఆకుతోట రమేష్, కోక్కు. శంకరయ్య, సెల్వం, కిషోర్ ఉన్నారు.



షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్ తదితరులతో ఎమ్మెల్యే విజయశ్రీ

# భార్య, బావమరిదిపై భర్త దాడి

ఆస్పత్రికి తరలిస్తుండగా బావమరిది మృతి

గూడూరు, ఆగస్టు 10: కుటుంబ కలహాల నేపథ్యంలో స్థానిక బనిగీసాహెబ్‌పేటలో భార్య, బావమరిదిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో బావమరిది మృతిచెందిన ఘటన శనివారం గూడూరులో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక మసీదువీధికి చెందిన సోనియాతో బనిగీసాహెబ్‌పేటకు చెందిన అల్లాబక్షుకు కొంతకాలం క్రితం వివాహమైంది. అల్లాభక్షు ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి కాపురంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోనియా అత్తగారి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. సమీపంలోనే అల్లాభక్షు వేరే ఇంట్లో తన తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో సోనియా సోదరులైన జాకీర్(28) కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తుండగా, షాకీర్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. వీరిద్దరూ సోదరి ఇంటికి మాట్లాడేందుకు శనివారం వచ్చారు. దీనిని గమనించిన అల్లాభక్షు, అతడి తల్లిదండ్రులు చాన్‌బాషా, షర్మిల మాట్లాడేందుకు సోనియా ఇంటి వద్దకు వచ్చారు. మాటామాటా పెరగడంతో వివాదానికి దారితీసింది. దీంతో అల్లాభక్షు, అతడి తల్లిదండ్రులు అక్కడ ఉన్న రోకలిబండతో సోనియా, ఆమె సోదరులపై దాడి చేశారు. ఈ దాడిలో సోనియా, జాకీర్‌లు తీవ్రగాయాలపాలయ్యారు. షాకీర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సోనియాను, జాకీర్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యంలో జాకీర్ మృతిచెందాడు. సోనియా నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి (ఇన్‌సెట్‌లో) మృతుడు జాకీర్ (ఫైల్ ఫొటో)

# చదువుతోపాటు ఉపాధి అవకాశాలు

గూడూరు, ఆగస్టు 10: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శనివారం ఆ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పించాలని వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ మేళాలో 33 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 1845 మంది విద్యార్థులు పాల్గొనగా 532 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వంకి అనూష, అరవింద, ప్రిన్సిపాల్ డాక్టర్ మురుగదాస్, కిరణ్‌కుమార్, సురేష్, డాక్టర్ మురళి, డాక్టర్ వేణుమాధవ్, రామయ్య పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలనలో వంకి పెంచలయ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు

## జగన్ పేరు తొలగింపుపై వైసీపీ నానాయాగీ

వాకాడు, ఆగస్టు 10 : విజయవాడలో అంబేద్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఆగంతకులు తొలగిస్తే వైసీపీ నేతలు నానాయాగీ చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు నందగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాకాడు మండలంలో గత 5 సంవత్సరాలు వైసీపీ విధ్వంస పాలన చేసిందన్నారు. గతంలో గూడూరు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి భిన్నంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రాజకీయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, తీపలపూడి రమణయ్య, బుజగేంద్ర, తుమ్మల మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

## టీడీపీ ప్రజాదర్బార్‌కు స్పందన

తిరుపతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్‌కు పలువురు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ప్రధానంగా శెట్టిపల్లి ప్లాట్ల సమస్య, రేణిగుంట నుంచి కడప వరకు ప్రారంభించిన హైవే విస్తరణలో కరకంబాడి దగ్గర భూములు కోల్పోయిన వారి నష్టపరిహారం గురించి అనేక వినతులు వచ్చాయి. వైసీపీ హయాంలో ఆక్రమణకు గురైన చెరువులను సర్వే చేయించి, వెంటనే వాటి అభివృద్ధికి రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకొనేలా కృషి చేయాలని పలువురు కోరారు. తిమ్మినాయుడుపాలెం హరిజనవాడకు శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు శ్రీధర్ వర్మ, ఊట్ల సురేంద్ర నాయుడు, మనోహర్ ఆచారి, రవిశంకర్, శంకర్ యాదవ్, శ్రీనివాస్, రెడ్డప్ప నాయుడు, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.



## దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 10: మండల పరిధి నెలబల్లిరెట్టపల్లిలోని గిరిజన కాలనీవాసులకు శనివారం పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ పొతుగుం మల్లికార్జున్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌బాబు, రమణారెడ్డి పాల్గొన్నారు.

## సుందరమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, ఆగస్టు 10: చిల్లకూరు దళితవాడలోని గ్రామ దేవత సుందరమ్మకు శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం, శనివారం, ఆదివారం మూడురోజులపాటు జరిగే తిరునాళ్లలో భాగంగా రెండో రోజు అమ్మవారి ఆలయంలో హోమపూజలు, కుంకుమార్చన జరిగాయి. టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 10: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అన్నదాన కార్యక్రమం

గూడూరు అర్బన్, ఆగస్టు 10: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కే.చంద్రశేఖర్, సురేష్‌రెడ్డి, రాధయ్య, కరీముల్లా, ప్రభాకర్, సతీష్, కళ్యాణి పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన వాహనాల్లో

## డీజిల్ చోరీ

సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు

పాకాల, ఆగస్టు 10: పార్కింగ్ చేసిన వాహనాల నుంచి రాత్రుల్లో డీజిల్ చోరీ చేస్తున్న నిందితులు సీసీ కెమెరాలకు చిక్కారు. మండలంలోని సేంద్రగుంట పెట్రోల్ బంక్ సమీపంలో పార్కింగ్ స్థలముంది. స్థానికులు, ట్రాక్టర్లు, ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు విశ్రాంతి కోసం ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఇటీవల పార్కింగ్ చేసిన నాలుగు ఐషర్ వాహనాలు, రెండు ట్రాక్టర్లలో డీజిల్ చోరీ అవుతున్నట్లు వాహన యజమానులు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి డీజిల్ చోరీ జరిగినట్లు గుర్తించి, శనివారం ఉదయం సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. ఓ యువకుడు రాత్రి సమయంలో డీజిల్ చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించి, పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గాదంకి, అగ్రహారం, మద్దినాయనిపల్లె, ఎస్ఆర్‌పురంకు చెందిన నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎంపిక

తిరుపతి(విద్య), ఆగస్టు 10: జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న ప్రకటించారు. శనివారం తిరుపతిలో ఎస్ఎఫ్ఐ నాయకులతో సమావేశమైన ఆయన నూతన కమిటీని ఎంపికచేసి నియమించారు. ఆమేరకు... జిల్లా అధ్యక్షుడుగా అక్బర్, ప్రధాన కార్యదర్శిగా భగత్‌రవి, ఉపాధ్యక్షులుగా తిరుపతికి చెందిన వినోద్, చంద్రగిరి చెందిన తేజ, పుత్తూరుకు చెందిన ఉమేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా సుస్మిత, నరేంద్ర, బాల గురవయ్య ఎంపికయ్యారు. మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా, 10 మంది కమిటీ సభ్యులుగా నియమించినట్టు ప్రసన్న ప్రకటించారు.

## ఏపీఐఐసీ భూములను అభివృద్ధి చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 10: మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవనీశంకరపురం గ్రామాలతో పాటు తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములను త్వరితగతిన అభివృద్ధి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవనీశంకరపురం గ్రామాల్లోని ఏపీఐఐసీ భూములను, రికార్డులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. మండలంలో మూడు గ్రామాల్లో 2095 ఎకరాలు భూములు ఏపీఐఐసీకి ఉన్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో భూములు కేటాయించి అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీసిటీని సందర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, డీటీ చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో సీసీఎల్ఏ



సీసీఎల్ఏకు ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో మూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, ప్రోటోకాల్ అతిథిగృహం వద్ద కలెక్టర్ వారిని కలిసి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.

## స్వర్ణముఖిలో స్నానానికి దిగి కూలీ మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: స్వర్ణముఖి నదిలో స్నానం చేసేందుకు దిగి సతీష్(45) అనే కూలీ మృతి చెందాడు. భద్రాచలం ప్రాంతానికి చెందిన సతీష్ ఉపాధి నిమిత్తం కొద్దినెలల క్రితం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. పట్టణ శివారులోని బైపాస్ వంతెన సమీపంలో శనివారం స్వర్ణముఖి నదిలో స్నానం చేసేందుకు దిగాడు. ఈ క్రమంలో నీటి మునిగి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ముగిసిన శిక్షణ తరగతులు

రేణిగుంట, ఆగస్టు 10: వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కరకంబాడి పంచాయతీ పరిధిలోని ఎస్వీడబ్ల్యూ షెడ్‌లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పొడి, తడి చెత్తతో సంపద సృష్టిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ భరత్‌కుమార్ తడి, పొడి చెత్తతో తయారు చేసిన ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో యూపీఆర్డీ వెంకటరత్న ప్రభ, కరకంబాడి పంచాయతీ కార్యదర్శి యూసఫ్‌ఖాన్, సర్పంచు నాగేశం, వివిధ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఆగస్టు 10: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామి వారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ నిర్వహించారు.

## సింహ వాహనంపై వీరభద్రస్వామి

నారాయణవనం, ఆగస్టు 10: నారాయణవనం మండలంలో వెలిసిన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం స్వామివారిని నిత్య పూజాలు చేసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామిని సింహవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగరాజు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి సత్యవేడు

# ప్రభుత్వాస్పత్రిలో పనిచేయని జనరేటర్

### ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ● రోగులకు తప్పని ఇక్కట్లు



ఎక్స్‌రే గది ముందు నిరీక్షిస్తున్న రోగులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఐదు గంటల పాటు రోగులకు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఆస్పత్రిలో ఏడాది నుంచి జనరేటర్ నిరుపయోగంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు కింద రూ.12 కోట్ల నిధులతో అరకొరగా ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పాత జనరేటర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. అయితే దానిని వాడుకలోకి తీసుకు రాలేదు. వైద్యాధికారులు తమ కార్యాలయాలకు మాత్రం ఇన్వర్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. వార్డులు, ఓపీ, ఎక్స్‌రే ల్యాబ్ వద్ద విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ సదుపాయాలు లేవు. ప్రతి రెండవ శనివారం శ్రీకాళహస్తిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మరమ్మతుల కోసం విద్యుత్‌శాఖ సరఫరా నిలిపివేస్తుంది. ఈ విషయం తెలిసినప్పటికీ ఆస్పత్రి అధికారులు జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకు రాకుండా ఏడాది నుంచి కాలయాపన చేస్తున్నారు. హోరుగాలులు, వర్షాలు వస్తే కొన్ని గంటల పాటు విద్యుత్ అంతరాయం తప్పదు. ఈ సమయంలో రోగులు దోమలతో అల్లాడిపోతున్నారు. రాత్రి వేళలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో పలుమార్లు పాములు వార్డుల్లోకి చొరబడ్డాయి. గత ఏడాది నవంబరులో వర్షాలు కురిసిన సమయంలో రెండు సార్లు అర్ధరాత్రి వేళ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో ఒక సారి అత్యవసర విభాగంలోకి, మరోసారి వార్డులోకి భారీ విషసర్పాలు ప్రవేశించి కలకలం రేపాయి. అయినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ఎక్స్‌రే వద్ద వైద్యసేవలు స్తంభించాయి. రోగులు చేసేదేమీ లేక నిస్సహాయస్థితిలో ఇంటికి తిరుగు ముఖం పట్టారు. ఇక వార్డుల్లో ఉక్కపోతతో రోగులు ఐదు గంటలపాటు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అయినప్పటికీ ప్రభుత్వాస్పత్రిలో కనీస వసతులు మెరుగుపడకపోవడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సుధీర్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి: టీడీపీ



మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని టీడీపీ నేత జయప్రకాష్ అన్నారు. ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి 50 రోజులు అయిన సందర్భంగా పట్టణంలో టీడీపీ నాయకులు 50మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన 50రోజుల్లోనే రాజీవ్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చి కబ్జాలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం మోపారన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీ వ్యవస్థను రూపుమాపి ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగేలా చేశారని తెలిపారు. అదే విధంగా పురపాలక సంఘ పరిధిలోని మురుగు కాలువలను పూడిక తీయించి స్వచ్ఛ శ్రీకాళహస్తికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ హాస్టళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడం, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపడం, పట్టణంలో నాలుగు మాడవీధుల్లో రాయకీయ ఫ్లెక్సీలు లేకుండా చేయడం వంటివి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకేష్, యశ్వంత్, కరీం, మీర్జా, అభిరాం తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనపై ఎస్పీ సీరియస్

### కేసు నమోదు

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కార్మికుడిపై దాడి చేసిన ఘటనపై ఎస్పీ సుబ్బరాయుడు తీవ్రంగా స్పందించారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు ఇద్దరు మందుబాబులపై కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన వద్ద బాలకృష్ణ అనే భవన నిర్మాణ కార్మికుడి శుక్రవారం మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంలో ఇద్దరు యువకులు మద్యం సీసాతో దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే. నిందితులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించినప్పటికీ మార్గమధ్యంలో వారిని విడిచిపెట్టేశారు. ఈ ఘటనపై శనివారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ సుబ్బరాయుడు వన్‌టౌన్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు బాధితుడిని పిలిపించి అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: కుటుంబ కలహాలతో ప్రవీణ్(26) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీకాళహస్తి పట్టణం దక్షిణకైలాస్ కాలనీలోని వడ్డిపాళెం కట్టపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. వడ్డిపాళెం గ్రామానికి చెందని ప్రవీణ్‌కుమార్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో లుంగీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కన్నుల పండువగా ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

ఏర్పేడు, ఆగస్టు 10: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు లలితా కరుణాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు అన్నామలై మొదలియార్, మురగప్ప మొదలియార్, అర్జునబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ చైర్మన్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన షేక్ రజియాను టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం సన్మానించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, మహ్మద్ షఫీ, ఖాదర్ బాషా, నయూమ్, మీర్జాబాయ్, సయ్యద్, బుజ్జి, జావిద్, జరీనా పాల్గొన్నారు.

## వైభవంగా గంగజాతర

వరదయ్యపాళెం, ఆగస్టు 10: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలో గంగజాతర వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం వెంకటేశ్వర స్వామికి అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ద్రౌపదీదేవి ఊరేగింపు



పిచ్చాటూరు, ఆగస్టు10: ధర్మరాజస్వామి తిరుణాళ్లలో శనివారం ద్రౌపదీదేవి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ట్రాక్టర్‌పై అధిష్టించి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం పిచ్చాటూరు పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. కాగా, ధర్మరాజస్వామి తిరుణాళ్లలో మంగళవారం భకాసుర వధ ఘట్టం నిర్వహించనున్నారు. సాయంత్రం 3 గంటలకు భీమ, భకాసురులు ఊరేగింపు, అనంతరం స్థానిక క్యాంపు గ్రౌండ్‌లో భకాసుర వధ, రాత్రి భీమసేనుడి ఉత్సవమూర్తి ఊరేగింపు జరగనుంది.





# పుత్తూరు వార్తలు

## రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రతిపాదనలు



స్టేషన్ మాస్టర్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

పుత్తూరు, ఆగస్టు 10: పుత్తూరు రైల్వేస్టేషన్ అభివృద్ధికి రైల్వే కన్సల్టివ్ కమిటీ శనివారం సమావేశమై పలు సూచనలను ప్రతిపాదించింది. చెన్నై నుంచి తిరుత్తణి వరకు వచ్చే లోకల్ మెమో రైళ్లను పుత్తూరు వరకు పొడిగించాలని, ఓవర్ బ్రిడ్జికి పైకప్పు వేయాలని, ధర్మరాజుల గుడి ఎదురుగా ట్రాక్‌పై జరిగే ప్రమాదాలను నివారించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని, ప్రతి శనివారం బెంగళూరుకు వెళ్లే ప్రత్యేక రైలు పుత్తూరు రైల్వేస్టేషన్‌లో ఆపాలని, ప్లాట్ మీద బోగీల డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని కన్సల్టివ్ కమిటీ ప్రతిపాదనలు చేసింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీధర్‌నాయుడు, కోటకొండబాబు, సుబ్రహ్మణ్యంరాజు, స్థానిక నాయకులు మధు, శంకర్, స్టేషన్ మాస్టర్ నాయక్, రైల్వే ఎస్ఐ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వ్యాఘ్రంపై ద్రౌపదీదేవి విహారం

పుత్తూరు టౌన్, ఆగస్టు 10: ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పులి వాహనంపై ద్రౌపదీ సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం బ్రహోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్లగుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగె నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు గెరిగె ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జునుడిని సుందరంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు గాండ్ల సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు కనుల పండువగా జరిగింది.

## సామరస్య ధోరణితోనే సమస్యల పరిష్కారం: పీఆర్‌టీయూ




సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్

పుత్తూరు/పుత్తూరు టౌన్, ఆగస్టు 10: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి కాకుండా సామరస్య ధోరణితో పీఆర్‌టీయూ పని చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరిప్రసాద్ అన్నారు. పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు కోసం రాష్ట్రపతిని కలిశామని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మార్చాలని, మహిళా ఉపాధ్యాయులకు రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవులు ఇవ్వాలని, ఉపాధ్యాయులకు కూడా డీఈవో, ఆర్జేడీ లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సదాశివన్, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా తుకారాం ఎన్నికయ్యారని ఎన్నికల అబ్జర్వర్ చెంగల్‌రాజు, అధికారి కణ్ణన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కణ్ణన్, రవియాదవ్, గురుమూర్తి, వెంకటరమణ, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఆగస్టు 10: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు.

## కాణిపాక వినాయకుడి సేవలో భానుప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 10: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం కాణిపాకంలోని స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, వినాయకస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

## యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ

పుత్తూరు టౌన్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ వేడుకలను శనివారం పుత్తూరులో ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. పట్టణం లోని ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు దాసరి మునెయ్య, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీదేవి, జిల్లా కార్యదర్శి భాస్కర్, వేణుగోపాల్, దశరథన్, బాలాజీ, జయచంద్రన్, మురళి తదితరలు పాల్గొన్నారు.